క్లుప్తంగా

మద్ది అంజన్నకు అభిషేకాలు



అంజన్నకు అభిషేక సేవ చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా ఆలయ ముఖ మండపంపై స్వామివారి ఉత్సవమూర్తికి అర్చకులు పంచామృత అభిషేకం చేశారు. పంగిడిగూడెం బాలత్రిపుర సుందరి భజన మండలి వారు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.95,299 సమకూరినట్టు ఈఓ ఆర్వీ చందన తెలిపారు. స్వామివారి నిత్యాన్నదాన సత్రంలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా అంధత్వనివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షల నిర్వహించారు. కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రి కంటి వైద్యుడు సీహెచ్ చక్రవర్తి మాట్లాడుతూ 240 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా, 15 మందికి దృష్టిలోపం ఉన్నట్టు గుర్తించామన్నారు. వీరికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఏలూరు వారు త్వరలోనే కళ్లజోళ్లు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుజాత, మెడికల్ ఆఫీసర్ తస్లీమా నస్రీన్, ఏఎన్ఎం అనంతలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆర్మీ అధికారులకు సన్మానం



రిటైర్డ్ ఆర్మీ అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పాకిస్తాన్ దుశ్చర్యను తిప్పికొట్టి కార్గిల్ భారత సైన్యం సాధించిన విజయం స్ఫూర్తిదాయకమని అని కుశల ఫౌండేషన్ చైర్మన్, బీజేపీ నాయకులు కొప్పాక శ్రీనివాసరావు అన్నారు. శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలలో శనివారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. భరతమాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత్ వలంటీర్ సాయి సింగ్ తివారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ నాటి యుద్ధంలో మృతిచెందిన వీరుల సంస్మరణార్థం జూలై 26న కార్గిల్ దివస్‌గా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్స్ మునునూరి మాధవరావు, జూలూరి రాఘవేంద్రరావులను సత్కరించారు. డిగ్రీ కళాశాల సీఏఓ సురేష్, రామచంద్ర డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై కేసు

టి.నరసాపురం: నిర్లక్ష్యంగా ఆటో నడిపి ఇద్దరు వ్యక్తులను గాయపరిచిన డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై ఎం జయబాబు తెలిపారు. బొర్రంపాలెంకు చెందిన బుడుపుల సాయి గణేష్, అడవికొట్టు కిషోర్‌లు మోటారు సైకిల్‌పై వెళుతున్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ముందుగా వెళుతున్న లారీని తప్పించే క్రమంలో లారీ పక్క నుంచి వెళుతన్న వీరు ఆటో సడెన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ఢీకొట్టి కింద పడిపోయారు. దీంతో తీవ్ర గాయాలైన సాయిగణేష్, కిషోర్‌లను వారి కుటుంబ సభ్యులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి ఏలూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సాయిగణేష్ తల్లి సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

కృత్రిమ అవయవాలు, కాలిపర్స్ అందజేత



దివ్యాంగురాలికి కృత్రిమ అవయవాన్ని అందిస్తున్న డాక్టర్ భాస్కర ఆనంద్‌కుమార్

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో ఈనెల 24, 25 తేదీల్లో హ్యాండ్, పీడియాట్రిక్ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. అందులో డాక్టర్ భాస్కర ఆనంద్‌కుమార్ 20 మంది రోగులను పరీక్షించి 10 మందికి శస్త్రచికిత్సలు చేశారు. గుప్తా ఫౌండేషన్ చైర్మన్ ఎంఎం గుప్తా సహకారంతో, ప్రోస్తాసిస్ 3డి ప్రింట్‌తో తయారు చేసిన కృతిమ అవయవాలు, కాలిపర్స్‌ను 14 మంది దివ్యాంగులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో విర్డ్ హాస్పిటల్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ట్రస్ట్ సభ్యులు ఐవీ ఆర్ సుధాకర్, వి.నారాయణ మూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్ర బాబు, సింధు, విజయ్ కిరణ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

కూటమి మోసాలను ఎండగడతాం

వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి విజయరాజు





బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమంలో విజయరాజు, నాయకులు, సమావేశంలో పాల్గొన్న నాయకులు

లింగపాలెం : కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు ఆరోపించారు. లింగపాలెం మండలం రంగాపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ నేత రెడ్డిన శ్రీనివాసరావు ఇంటి వద్ద పార్టీ మండల అధ్యక్షుడు అన్నపనేని శాంతరావు అధ్యక్షతన శనివారం పార్టీ మండల విస్తృత స్థాయి నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అధికారంలోకి వచ్చిన ఏడాదిలోకే ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేసి చూపించామని గుర్తుచేశారు. అధికార దాహంతో అబద్ధ హామీలు ఇచ్చి పాలన చేపట్టిన కూటమి నాయకులు ప్రజలను నిలువనా మోసం చేశారని ధ్వజమెత్తారు. ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని అన్నారు. మ్యానిఫెస్టోకి హామీ ఇచ్చిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు మౌనవ్రతం చేయడం సిగ్గుచేటన్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులను, నిరుద్యోగ భృతి ఊసే లేదని ఈ పథకాన్ని అమలు చేస్తే రాష్ట్రాన్ని అమ్మివేయాలంటూ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడు అనటం మోసం కాదా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, అభిమానులపై దాడులు, అక్రమంగా అరెస్ట్ చేయడం తప్ప ప్రజా సంక్షేమంపై దృష్టి లేదని ఆరోపించారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని, పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. అనంతరం ప్రభుత్వం చేసే మోసాలను తెలియజేసే క్యూఆర్ కోడ్ బ్రోచర్లను విడుదల చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మట్టా సురేష్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి జగన్, ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఉప్పలపాటి వరప్రసాద్, రాష్ట్ర మాజీ లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, సర్పంచ్‌లు చలగుళ్ల రవిబాబు, ఇనుగంటి రాజేష్‌బాబు, తాడేపల్లి శాంతరావు, డి.రవీంద్ర, పి.ప్రసాద్, ఎంపీటీసీలు, నాయకులు రావి కొండయ్య, కోటగిరి హరీష్, ఏపూరి వెంకట్రావు, రెడ్డిన శ్రీను, కోటగిరి ధీరాజ్ కృష్ణ, బి.ప్రభాకరెడ్డి, ఒ.ప్రభాకరావు, కర్లపూడి ఆనంద్, గుర్రాల సత్యన్నారాయణ, కె రఘు, మందలపు పెద చంటియ్య, చీదరాల ప్రసాద్, ముళ్లపూడి సుమన్, సీహెచ్ సూరిబాబు, టి.మధు, సత్యనారాణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గ్రామ పరిశీలకులు వీరే

గ్రామ కమిటీల నియాకం, బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని గడప గడపకు తీసుకెళ్లేందుకు గ్రామాల వారీగా పార్టీ నాయకులను పరిశీలకులుగా నియమించారు. వీరి పేర్లను విజయరాజు, అన్నపనేని శాంతరావు ప్రకటించారు. ములగలంపాడు, వేములపల్లి పంచాయతీలకు రెడ్డిన శ్రీను, కె.గోకవరానికి ఇనుగంటి రాజేష్‌బాబు, బాదరాలకు కోటగిరి ధీరాజ్ కృష్ణ, పాశ్యానగరానికి ఏపూరి వెంకట్రావు, రంగాపురానికి టి.శాంతరావు, మునునూరి వెంకటేశ్వరరావు, భోగోలుకు ఉప్పలపాటి వరప్రసాద్, అయ్యపరాజుగూడెంకు సీహెచ్ సూరిబాబు, కలరాయనగూడెంకు సీహెచ్ ప్రసాద్, ధర్మాజీగూడెంకు చలగుళ్ల రవిబాబు, భీమిరెడ్డి ప్రభాకరరెడ్డి, నరసన్నపాలెంకు పి.గణేష్, కొత్తపలి, ముడిచెర్లకు మునునూరి వెంకటేశ్వరరావు, శింగగూడెంకు ఓబిళ్లనేని ప్రభాకరావు, తోచలకరాయుడుపాలెంకు సొంగా సందీప్, కొణిజర్లకు మట్టా సురేష్‌బాబు, అన్నపనేనివారిగూడెంకు కర్లపూడి ఆనంద్, యడవల్లికి కోటగిరి హరీష్, ఆశన్నగూడెంకు డి.రవీంద్ర, లింగపాలెంకు కోఠారి మోహన్, అన్నపనేని శాంతరావు, మఠంగూడెంకు మోరంపూడి జగన్, పుప్పాలవారిగూడెంకు కఠికినేని రఘలను నియమించారు. వీరంతా ఒక్కో గ్రామ కమిటీకి 9 మంది చొప్పున సభ్యులను నియమించి, వివిధ పదవులను కేటాయిస్తారని విజయరాజు, శాంతారావులు తెలిపారు.

పోలింగ్ బూత్‌లలో సౌకర్యాల కల్పనకు కృషి

బుట్టాయగూడెం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 1200 ఓటర్లు దాటిన బూత్‌లను వేరు చేస్తున్నట్టు ఆర్డీఓ ఎల్ దేవకీదేవి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం పోలవరం నియోజకవర్గ స్థాయి రాజకీయ నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. పోలవరం నియోజకవర్గంలో ఉన్న పోలింగ్ బూత్‌లను మౌలిక సదుపాయాలు కల్పించేలా కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌ల సంఖ్య పెరగనున్నట్టు తెలిపారు. 325 పోలింగ్ బూత్‌లు ఏర్పాటయ్యే అవకాశం ఉందన్నారు. వీటిపై అభ్యంతరాలుంటే తెలపాలని నాయకులను కోరారు. రాజకీయ నాయకులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాలకు తరలివచ్చారని వీరికీ ఇదే మండలాల్లో ఓటు హక్కు కల్పించాలని కోరారు. నిర్వాసితులకు సంబంధించి గజిట్ రావాల్సి ఉందని, చివరి నిర్వాసితులు తరలివచ్చే వరకు వారి పాత గ్రామాల్లో ఉన్నట్టు లెక్క వస్తుందని ఆర్డీఓ తెలిపారు. వారిని తరలించినప్పటికీ ఆయా గ్రామాల పేరుతోనే నిర్వాసిత కాలనీలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు, రాజకీయ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కుక్కునూరు: గోదావరి నదిలో వరద ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో మండలంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పి.రమేష్ బాబు సూచించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శనివారం భద్రాచలం వద్ద 35 అడుగుల గోదావరి నీటిమట్టం నమోదైందన్నారు. ప్రజలు నదిలో స్నానాలకు, చేపల వేటకు వెళ్లవద్దని, వాగులు, కాలువగట్లు దాటావద్దని హెచ్చరించారు. ప్రజలు అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బెల్లపు ఊట ధ్వంసం

చింతలపూడి : స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చింతలపూడి మండలం తలర్లపల్లి గ్రామంలో ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఒక మహిళను అరెస్ట్ చేసి 50 లీటర్లు పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామని సీఐ పి.అశోక్ తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దు

ద్వారకాతిరుమల: భక్తులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని శ్రీవారి దేవస్థానం అధికారులు శనివారం వ్యాపారులను హెచ్చరించారు. కొండ పైన తూర్పు ప్రాంతంలోని దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్‌లో కొందరు పోటీపడి దుకాణాలను ముందుకు జరిపి, వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో భక్తులు నడిచేందుకు వీలులేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న ఆలయ ఏఈఓ రమణరాజు, సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు వ్యాపారులను హెచ్చరించారు.

కాలనీ వాసులకు అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ నేత జెట్టి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి



కాలనీ వాసులతో మాట్లాడుతున్న గురునాథరావు, లక్ష్మి

జంగారెడ్డిగూడెం: స్థానిక సుబ్బమ్మపేట రోడ్డు పక్కన కాలనీవాసులకు అండగా ఉంటామని మున్సిపల్ చైర్పర్సన్ బత్తిన లక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులు జెట్టి గురునాథరావు అన్నారు. శనివారం స్థానిక సుబ్బంపేట సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న కాలనీవాసుల ఇళ్లను తొలగిస్తున్న నేపథ్యంలో వారిని పరామర్శించారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్నామని, తమ ఇళ్లకు విద్యుత్ బిల్లులు, మున్సిపల్ కుళాయి బిల్లులు, ఇంటి పనులు కడుతున్నామని కాలనీవాసులు వివరించారు. ఒక్కసారిగా తమను ఇల్లు ఖాళీ చేయాలని కొందరు ప్రభుత్వాధికారులు ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. దీనిపై బత్తిన లక్ష్మి, జెట్టి గురునాథరావులు మాట్లాడుతూ అధైర్య పడొద్దని, అండగా ఉంటామని భరోసా కల్పించారు. బాధితులకు ప్రత్యామ్నాయంగా వేరొకచోట ఇల్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. కొంత సమయం ఇచ్చేలా కృషిచేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని, కష్టాల్లో తమ వెన్నంటే ఉంటామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కర్పూరం గవరయ్య గుప్తా, మునిసిపల్ వైస్‌చైర్మన్ ముప్పిడి అంజి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ముప్పిడి శ్రీనివాసరావు, కౌన్సిలర్ పీపీఎస్ చంద్రరావు, బత్తిన చిన్న, చింత అనిల్, సంకు సురేష్, కాసర బన్నీ, వెంప ఐజి, వీరవల్లి సోమేశ్వరరావు, జ్ఞాని, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవాగు ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టాలి



ఎమ్మెల్యే సాంబశివరావుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

వేలేరుపాడు: తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండలంలో ఉన్న పెద్దవాగు ప్రాజెక్ట్‌కు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వేలేరుపాడు సీపీఐ మండల సమితి విజ్ఞప్తి చేసింది. శనివారం అశ్వారావుపేట వచ్చిన ఆయన్ని సీపీఐ స్థానిక నాయకులు కలిసి విలీన మండలాల పరిస్థితిని వివరించారు. పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడటం వల్ల వేలేరుపాడు, కుక్కునూరులోని సుమారు 13 వేల ఎకరాల్లో పంటలు పండటానికి ఆధారం లేకుండా పోయిందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తూ సకాలంలో సాగునీరు అందించేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది వర్షాకాలంలో అధిక వర్షాలకు ప్రాజెక్టుకు గండిపడిందని, వేల ఎకరాల భూమి, వందల కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్రంలో ఆ ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉన్న మూడు వేల ఎకరాలకు మాత్రమే నీరు అందేలా మరమ్మతు పనులు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందని గుర్తుచేశారు. దీనిపై ఆధారపడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 13వేల ఎకరాల భూమి వర్షాధారమై పంటలకు నోచుకోలేదని వివరించారు. వ్యవసాయ కూలీలుగా ఉన్న మండలంలో వేల కుటుంబాలు ఉపాధి కోల్పోయాయని తెలిపారు. రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎండీ మునీర్, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, మండల కార్యదర్శి బాడి రాము, రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో మహిళలపై వేధింపులు



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న రవి

జంగారెడ్డిగూడెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతోనే మహిళలపై వేధింపులు ఎక్కువవుతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.రవి ఆరోపించారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం శిక్షణా తరగతులు ఎ.శ్యామల రాణి అధ్యక్షతన నిర్వహించారు. ప్రభుత్వ విధానం మహిళలపై ప్రభావం అనే అంశంపై రవి మాట్లాడారు. మహిళలకు పనిప్రదేశాలలో లైంగిక వేధింపులు ఉన్నాయన్నారు. ఉపాధి పనులు కూడా సక్రమంగా అమలు కావటం లేదని, రోజు రోజుకి పెరుగుతున్న ధరల వల్ల మహిళకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వివరించారు. మహిళా పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. మహిళాభ్యున్నతికి, స్త్రీ పురుష సమానత్వానికి మహిళా సంఘం కృషి చేస్తోందని సంఘం జిల్లా మాజీ అధ్యక్షురాలు ఎం నాగమణి తెలిపారు. మద్యంవల్ల అనేక కుటుంబాలు వీధుల పాలవుతున్నాయని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ తరగతుల్లో ఎం కుమారి, శిరీష, గాయత్రి, కె.దీప, భవాని, పార్వతి, బేబీ షామిలి, ఎం సుధారాణి, నాగలక్ష్మి, బి.దుర్గమ్మ, కృష్ణవేణి, కె.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత



మాట్లాడుతున్న ఏడీ సుబ్బారావు

చింతలపూడి: ప్రకృతి వ్యవసాయం పట్ల రైతుల్లో అవగాహన పెరుగుతోందని చింతలపూడి వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీ వై.సుబ్బారావు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో శనివారం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో వ్యవసాయ రంగంలో ప్రకృతి వ్యవసాయం ప్రథమ స్థానంలో నిలుస్తుందని ఆయన అన్నారు. నాలుగు మండలాల సిబ్బందిని ప్రకృతి వ్యవసాయ విస్తరణలో భాగస్వామ్యులవ్వాలని కోరారు. పంట నమోదులో ప్రకృతి వ్యవసాయాన్ని పాటించే రైతులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వివరించారు. చింతలపూడి డివిజన్ పరిధిలోని లింగపాలెం, కామవరపుకోట, చింతలపూడి, టి.నర్సాపురం మండలాల్లో రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జీలకు మూడు రోజుల పాటు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. మొదటి రోజు రైతు సాధికార సంస్థ ఆర్ఎస్‌కే, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా ప్రకృతి వ్యవసాయం లక్ష్యాలు, సిద్ధాంతాలను వివరించారు. రెండో రోజు క్షేత్రస్థాయిలో విత్తన గుళికల తయారీ విధానం, ఘన కషాయాలు, ద్రవ ద్రావణాల అనుసంధానంపై శిక్షణ ఇచ్చారు. ఏలూరు జిల్లా ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి బి.వెంకటేష్ పాల్గొని రైతుల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచాలని సూచించారు. ప్రకతి వ్యవసాయంలోని శాస్త్రీయతను వివరించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై అపోహ వద్దు

జంగారెడ్డిగూడెం: స్మార్ట్ మీటర్ల వల్ల అదనపు విద్యుత్ బిల్లులు రావని, అపోహలు వద్దని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ వినియోగదారులకు సూచించారు. శనివారం డీఈ యు.సుబ్బారావు, ఏఏఓ ఏసుబాబులతో కలిసి స్థానిక ఈఈ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రయోజనాలను వివరించారు. స్మార్ట్ మీటర్ అమలుకు సహకరించాలని కోరారు. మీటర్‌లో సమస్య ఉంటే దగ్గరలో ఉన్న కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ద్వారకాతిరుమల: ప్రస్తుతవర్షాలకు ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె. గోవిందరావు సూచించారు. మండలంలోని సీహెచ్ పోతేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రామానుజాపురం గ్రామంలో ఇంటింటా ఫీవర్ సర్వే, దోమల లార్వా పెరిగే స్థలాలగుర్తింపు కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నీట మునిగిన గుండేటి వాగు వంతెన



నీట మునిగిన గుండేటి వాగు వంతెన

కుక్కునూరు: ఎగువన కురిసిన భారీ వర్షాలకు గోదావరికి వరద ఉధృతి పెరిగింది. శనివారం సాయంత్రం భద్రాచలం వద్ద గోదావరి వరద 35 అడుగులకు చేరింది. పెరిగిన గోదావరి వరదతో కుక్కునూరు – దాచారం గ్రామాల మధ్య ఉన్న గుండేటి వాగు వంతెన పూర్తిగా నీటమునిగింది. దీంతో కుక్కునూరు మీదుగా దాచారం, బెస్తగూడెం, వేలేరుపాడు మండలాలకు రాకపోకలు నిలిచాయి. ఆయా గ్రామాల ప్రజలు కుక్కునూరు నుంచి నల్లకుంట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు.